# డబ్బు కన్నా చదువు ఎంతో విలువైనది

**ఆర్బీవీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సరళాశ్రీనివాస్‌రెడ్డి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 21, ప్రభాతవార్త :** పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్బీవీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళాశ్రీనివాస్‌రెడ్డి చేయూతనిస్తున్నారు. తాండూరు నియోజకవర్గానికి చెందిన అనేక మంది పేద విద్యార్థుల కోసం ఇప్పటి వరకు లక్షల రూపాయల విరాళం అందజేశారు. ప్రస్తుతం ఓ పేద విద్యార్థి ఉన్నత చదువుల కోసం రూ.21 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్ గ్రామానికి చెందిన గ్రామీణ విలేకరి విజయ్‌కుమార్ తనయుడు శరత్‌చంద్ర ఫిజియోథెరపీ కోర్సులో చేరాడు. ఆ విద్యార్థికి ఫీజులు భారంగా మారడంతో సమాచారం తెలుసుకున్న సరళారెడ్డి బుధవారం విద్యార్థిని పిలిపించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె ఉదార స్వభావానికి తబ్బిబ్బయిన విద్యార్థి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదారేళ్లుగా సరళారెడ్డి నిరుపేద విద్యార్థుల చదువులకే కాకుండా ఆసుపత్రుల ఖర్చులకూ తనవంతు సహాయం అందజేస్తున్నారు. గత కొంతకాలంగా ఆర్బీవీఎల్ పరిశ్రమ ద్వారా రక్షణశాఖకు రూ.2 లక్షల చొప్పున విరాళం అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బు కన్నా చదువు ఎంతో విలువైనదని గుర్తు చేశారు. బాల్యం నుంచి చదువులపైనే ధ్యాస పెట్టాలని ఉద్బోధించారు. గొప్ప చదువులు అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.



విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సరళారెడ్డి

విద్యార్థులకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఆటంకం కారాదని అన్నారు. అలాంటి వారికి అండగా ఉంటామని సరళారెడ్డి భరోసా ఇచ్చారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## తాండూరులో ఆ మూడే..
# నిర్ణయాత్మకం

**మున్సిపాల్టీలో మొత్తం ఓటర్లు 77,110 మంది**
**అత్యధికంగా ముదిరాజ్‌లే - 20 వేలకు పైగా ముస్లిం ఓటర్లు - లింగాయత్‌లు 11 వేల మంది - ప్రతీ ఎన్నికల్లో ఎంఐఎం బలమైన ముద్ర - మెజార్టీ ఓటర్లున్నా..చైర్మన్ పీఠం దక్కలేదని ముస్లిం, ముదిరాజ్ నేతల ఆవేదన**
**ఈసారి బిసికి రిజర్వు అయిన చైర్మన్ సీటు**



**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** స్థానిక సంస్థలలో కుల, మత ప్రాతిపదికన ఓటింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయి. కొంత కాలంగా ఈ జాఢ్యం చాపకింద నీరులా మారుతోంది. దీని ప్రభావం అభ్యర్థుల తలరాతను మార్చేస్తోంది. కుల, మత సునామీ వస్తే ఒక్కోసారి అభ్యర్థులు మునిగిపోవచ్చని, అనుకూలమైన వారు విజయ తీరాలను చేరవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో తాండూరు పట్టణ ఓటర్లు ఏ దిశగా మొగ్గు చూపుతారోనని అంచనాలు కడుతున్నారు. ఈసారి చైర్మన్ సీటు బిసి జనరల్‌కు కేటాయించారు. పట్టణంలో 36 వార్డులు ఉన్నాయి. 77,110 మంది ఓటర్లు ఉన్నారు. 39,558 మంది మహిళలు, 37,547 మంది పురుషులు, ఐదుగురు ఇతరుల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే, ఇక్కడ జనాభా పరంగా చూస్తే లక్షకు మించినట్లు అనధికారిక సమాచారం. ఓటర్ల జాబితా ప్రకారం పరిశీలించినట్లయితే అత్యధికంగా ముదిరాజ్‌లే ఉన్నారు. అనధికారిక లెక్కల ప్రకారం 23 వేల పైచిలుకు ఆ వర్గాల ఓటర్లు ఉండగా, 20 వేలకు పైగా ముస్లిం ఓటర్లు ఉన్నారు. లింగాయత సామాజికవర్గానికి చెందిన వారు 11 వేల మంది ఉన్నట్లు సమాచారం.

ఈ మూడు సామాజికవర్గాల తర్వాత ఆర్యవైశ్యులు, మున్నూరుకాపు, రెడ్లు, గౌడ్లు, యాదవ, చాకలి, ఉప్పరి తదితర కులాల ఓటర్లు ఉన్నారు. దానివల్ల ప్రతీ ఎన్నికల్లో ఎంఐఎం బరిలో నిలిచి అభ్యర్థులను గెలిపిస్తోంది. 2014 ఎన్నికల్లో ఏకంగా ఎంఐఎం తరపున 10 మంది గెలుపొందగా అన్ని పార్టీలు కలిపి 13 మంది ముస్లింలు కౌన్సిల్‌లో అడుగు పెట్టారు. ప్రతి కౌన్సిల్‌లో లింగాయత సామాజికవర్గం నుంచి ముగ్గురు లేదా నలుగురు గెలుపొందుతున్నారు. గతంలో ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు కూడా గద్దెనెక్కారు.

అయితే, మెజార్టీ ఓటర్లున్న ముస్లిం ముదిరాజ్ సామాజికవర్గం నేతలు ఇప్పటి వరకు చైర్మన్ పీఠాన్ని దక్కించుకోలేకపోయారు. ముగ్గురు రెడ్లు, ఇద్దరు లింగాయత్, ముగ్గురు ఆర్యవైశ్య, ఇద్దరు గౌడ్లు చైర్మన్లుగా గద్దెనెక్కారు. యాదవ, మున్నూరు కాపు సామాజికవర్గానికి ఒక్కోసారి అవకాశం దక్కింది. మరి ఈసారి ఎవరికి చైర్మన్ సీటు దక్కుతుందో వేచి చూడాల్సిందే.

## ఎన్నికల కోసం వచ్చివెళ్లేటోడ్ని కాదు
## మాటిస్తే కట్టుబడి ఉంటా



**వార్డుల్లో సమస్యలు ఉంటే నేరుగా నాకు చెప్పండి- కార్యకర్తలకు ఏ అవసరం ఉన్నా నన్ను కలవచ్చు - పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ హవానే నడిచింది - ఈసారీ మనదే అగ్రస్థానం కావాలి - బిఆర్ఎస్‌కు కనీసం 10శాతం కూడా కష్టమే - మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి దిశానిర్దేశం - మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా సిఎం పంపారని వెల్లడి**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 21, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలను ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సర్వే ఆధారంగ వార్డుల్లో గెలిచే వారికి పార్టీ టికెట్లు ఖరారు చేస్తారని తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా శుభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి. వేదికపై డిసిసి చీఫ్ వజ్రేశ్‌యాదవ్, పలువురు కాంగ్రెస్ ప్రముఖులు

గార్డెన్‌లో అలియాబాద్, మూడుచింతల పల్లి, ఎల్లంపేట్ మున్సిపాల్టీల కాంగ్రెస్ పార్టీ సమావేశం మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ' మున్సిపల్ ఎన్నికల కోసం మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా నన్ను సిఎం పంపారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళతా. పార్టీ కోసం కష్టపడే

మిగతా 2లో

## మిత్రుల కోసం 3 వార్డులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 21, ప్రభాతవార్త :** తాండూరులో మిత్రపక్షమైన టిజెఎస్ పార్టీకి మూడు వార్డులను కేటాయించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు ముందుకు వచ్చినట్లు తెలిసింది.

**తాండూరులో టిజెఎస్‌కు కాంగ్రెస్ ఆఫర్**
**కాంగ్రెస్ గుర్తుతోనే పోటీ చేయాలని షరతు**
**విముఖత వ్యక్తం చేసిన టిజెఎస్ ఇన్‌చార్జి**
**సొంత పార్టీ గుర్తుతోనే పోటీ చేస్తామని స్పష్టీకరణ**
**ఓట్లు చీలిపోతాయని కాంగ్రెస్ ఆందోళన**
**నచ్చచెప్పటానికి ప్రయత్నాలు**

రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి నిర్వహించిన అంతర్గత సమావేశంలో వార్డుల వారీగా సమీక్షించారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేసిన టిజెఎస్ తాండూరు నియోజకవర్గ చైర్మన్ సాంబూరు సోమశేఖర్‌కు మూడు వార్డులను ఇవ్వాలని బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అందుకు ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారు. పట్టణంలోని వార్డునెంబర్ 33, 34లతో పాటు 23 లేదా 24లలో టీజేఎస్ పోటీ చేస్తే అక్కడ కాంగ్రెస్ అభ్యర్థులను తప్పించనున్నారు. కానీ ఈ మూడు స్థానాలలో కాంగ్రెస్ బీఫారాలను ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిజెఎస్ ఎన్నికల గుర్తు

మిగతా 2లో

# ఇద్దరు ఉపాధ్యాయులకు జైలుశిక్ష, జరిమానా

**నకిలీ మెడికల్ బిల్లులతో చీటింగ్ ఎఫెక్ట్**



**దౌల్తాబాద్, జనవరి 21 ప్రభాతవార్త :** నకిలీ మెడికల్ బిల్లులతో ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బును పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కొడంగల్ జ్యోడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. ఎస్సై.బి.రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సంభందించిన క్రైమ్ నెంబర్ 92/2013 యూఎస్403, 409, 120(బీ)ఐపీసీకి సంభందించిన నకిలీ మెడికల్ బిల్స్‌తో ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బును పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు కొడంగల్ జ్యుడిసియల్ ఫస్ట్ కక్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బి.శ్రీరామ్ తీర్పు వెలువరించినట్లు తెలిపారు. నకిలీ మెడికల్ బిల్లులు సబ్మిట్ కేసులో ఉపాధ్యాయుడు రఘువీర్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

అలాగే మరో ఉపాధ్యాయుడు హెచ్.సత్యనారాయణరెడ్డికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తు బుధవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.

## గణతంత్ర వేడుకల్లో
# జాతీయ భావం కనిపించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**వికారాబాద్, జనవరి 21, ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవ వేడుకల ు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్ల ు పకడ్బందీగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధి కారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలునందు అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల పైవివిధ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహించ నున్నందున అందుక నుగుణంగా వేదిక, విఐపిలు, అధికారులకు, ఇతరులకు అ నుకూలంగా సీటింగ్, బారికేడ్స్, లైట్స్ ఏర్పాట్ల ు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్ అ నుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావం పెంపొందేలా విద్యార్థులచేవి నూత్న సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతల ు సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా మాట్లాడుతూ పూర్తి స్థాయి లో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డీఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర తదితరులు



# మహాత్మునిపై మతోన్మాదమా!

**రంగారెడ్డి అర్బన్, జనవరి 21, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వీబీజీ-రామ్ జీ 2025 వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ బిల్లును తక్షణమే రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసిసి పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటానికి ప్రతీకగా నిలిచిన మహాత్మా గాంధీ పేరును తొలగించి

**ఉపాధి పనులపై నిషేధం వద్దు**
**వ్యవసాయ సంక్షోభం పెరుగుతుంది**
**కార్మికుల ఆగ్రహానికి గురికాకముందే కేంద్రం ఉపసంహరించాలి**
**డిసిసి చీఫ్ నరసింహారెడ్డి డిమాండ్**
**చరికొండలో కాంగ్రెస్ నేతల భారీ నిరసన**

కొత్త చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో బిజెపి

మిగతా 2లో

## వ్యవసాయ పరికరాలతో పాటు
# పిచికారి యంత్రాలూ ఇస్తాం

**ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్**

**వికారాబాద్, జనవరి 21, ప్రభాతవార్త :** ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాల ు రైతులు పొందాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. వ్యవసాయ పరికరాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న 43 మంది రైతులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా రొటావేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేయర్ల ు అందజేయడం జరిగింది. ఈ



సందర్భంగా రైతుల ను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాల ు అందిస్తోందని.. రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయానికి వాడుకునే పరికరాల కొ నుగోలుకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలతో పాటు పిచికారి యంత్రాల ు కూడా అందజేయనుందన్నారు. అర్హులైన రైతులు వ్యవసాయ పరికరాల నిమిత్తం దరఖాస్తు చేసుకోవాలని అదేవిధంగా చిన్న సన్నకారు రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, అంజయ్య, విజయ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**అధ్యక్షా..అని పిలవాల్సి వస్తుందనే కెసిఆర్ అసెంబ్లీకి రాలే..**
**డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ డిమాండ్**

**వికారాబాద్, జనవరి 21, ప్రభాతవార్త :** తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని మాట ఇచ్చి తప్పారని, దళిత ద్రోహి మాజీ సీఎం కేసీఆర్ అని డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని స్పీకర్ ప్రసాద్‌కుమార్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ, పార్టీ మారారని అభియోగం మోపబడిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజ్యాంగ బద్దంగా, న్యాయ నిపుణుల సమక్షంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ న్యాయ బద్దంగా విచారణ చేపట్టి తీర్పునిచ్చారని అన్నారు. అట్టి విషయంపై బీఆర్ఎస్ నేతలు స్పీకర్ పై లోనిపోని ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. స్పీకర్ అమ్ముడు పోయారని ఆరోపించడం సరైంది కాదని, 2014, 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యే లను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని ప్రతిపక్ష హోదా లేకుండా చేశారని గుర్తు చేశారు. నాడు బీఆర్ఎస్ వారు ఎంతకు అమ్ముడు పోయారో తేల్చి చెప్పాలని ఉద్ఘాటించారు. మచ్చలేని నాయకుడైన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అధ్యక్ష పీఠాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ గెలుపును సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులకు కానుకగా ఇస్తామని అన్నారు. ఉపాధిహామీ పతకంలో గాంధీ పేరును తొలగించి, నిధులు మంజూరులో 60 శాతం కేంద్రం వాటా, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పూనుకొందని, దీనికి నిరసనగా, ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి తీర్మాణాలు చేసి, ఆ తీర్మాణ ప్రతులను టీపీసీసీ కి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో గ్రామాల్లోని ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని కులాల వారికి సమన్యాయం చేస్తోందని, ఇందులో భాగంగానే అసెంబ్లీ స్పీకర్ పదవి దళితుడైన వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కట్టబెట్టిందని అన్నారు. దళితుడిని అధ్యక్షా..అని పిలువాల్సి వస్తుందనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితుడు రాజయ్యను డిప్యూటీ సీఎం పదవి నుంచి తొలగించిన ఘనత కేసీఆర్ కే దక్కిందని గుర్తు చేశారు. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ నాయకులు కొల్కుంద సంతోష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు చిగుర్లపల్లి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఫుట్ ఓవర్ బ్రిడ్జికి లైన్ క్లియర్

**వచ్చే నెలలో టెండర్లు - ఏప్రిల్‌లో పనులు ప్రారంభిస్తాం**
**రైల్వే ఎజిఎం కోట్ల ఉదయ్ కుమార్**

**కొత్తూర్, జనవరి 21, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముందుగు పడింది. దీర్ఘకాలంగా జాప్యం జరుగుతున్న ఈ వ్యవహారంలో దీర్ఘకాలంగా జాప్యం జరుగుతున్న నేపథ్యంలో స్థానిక పెద్దలు ఇటీవల దక్షి ణ మధ్య రైల్వే ఎజిఎం కోట్ల ఉదయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లా డుతూ.. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులకు ఫిబ్రవరి నెలలో టెండర్లు పిలవనున్నామని వెల్లడించారు. ఏప్రిల్ నెలలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గత సంవత్సరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, దక్షి ణ మధ్య రైల్వే డిఆర్ఎంతో సమా వేశమై పాదచారులు పడుతున్న ఇబ్బందులను వివవరించారు. అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. ఈ విషయంలో శ్రద్ధ చూపి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఆ తర్వాత కూడా పలు సందర్భాలలో రైల్వే ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా రైల్వే శాఖ నుంచి కోట్ల రూపాయల నిధులు మంజూర య్యాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు సురక్షి తంగా రైల్వే పట్టాలు దాటేందుకు అవకాశం కలగనుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఏడాదిగా తాగు నీళ్లు లేవ్

**రోడ్డు విస్తరణలో పైపులు ధ్వంసం**
**రోడ్డు పనులు అయినా పునరుద్ధరణలో జాప్యం**
**తాగు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నాం**
**మా సమస్య ఎందుకు పట్టించుకోరు?**
**కమిషనర్‌ను నిలదీసిన భరత్ నగర్ కాలనీ వాసులు**



**కొత్తూర్, జనవరి 21, ప్రభాతవార్త:** ఎంతో కాలంగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నా ఎందుకు పట్టించుకోవటంలేదని కొత్తూరు మున్సిపల్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ వాసులు అధికారులను నిలదీశారు. బుధవారం స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ గోడు వెళ్లకక్కారు. ఏడాది నుంచి తమకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు విస్తరణ పనుల సమయంలో తాగునీటి పైపులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని చెప్పారు. రోడ్డు పనులు పూర్తైనప్పటికీ ఇప్పటివరకు కొత్త పైపులు పునరుద్ధరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మానవత్వంతో తమ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కాలనీ ప్రముఖులు ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ కౌన్సిల్ సమావేశంలో చర్చించి తర్వలోనే మంచి నీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి వరకూ కాలనీకి మంచినీటి ట్యాంకులు పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూప్‌సింగ్, యాదగిరి, శ్రీను, లక్ష్మణ్, సురేష్, ప్రభు, రాజశేఖర్, శ్రీకృష్ణ, రాజేందర్ రెడ్డి, సుమన్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి

# బ్రహ్మోత్సవాలకు పగడ్బందీ ఏర్పాట్లు

..మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి
..ఫిబ్రవరి 13నుంచి 18 వరకు బ్రహ్మోత్సవాల నిర్వాహణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 21, ప్రభాతవార్త:** కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బంధీగ ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో ఉంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ చూడాలని ఆయన సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలుపై మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగువార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కుశాయిగూడ ఏసిపి వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రాజేశ్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ, ఆలయ ఇఓ సుదాకర్‌రెడ్డిలతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఫిబ్రవరి 13వతేదీ నుంచి 18వరకు కీసరగుట్ట రామలింగేశ్వంస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు వచ్చె భక్తులకు సౌకర్యవంతంగ ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్‌లను పెంచాలని, భక్తులు అధికంగా రానున్నందున ఆర్టీసి బస్సులను పెంచాలని, భద్రతా లోపం లేకుండ పోలీస్‌శాఖ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సలకై అవసరమైన వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. బారికేడ్స్, దర్శనం క్యూలైన్స్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులకు సూచించారు. జాతరలో భక్తులకు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికి సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని, అందుకు సంబంధించి ఎప్పటికపుడు శానిటేషన్ చేయాలని అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర సమయంలో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్స్ అందుబాటులో పెట్టాలన్నారు. మహాశివరాత్రికి కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిదులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, పాల్గొన్న మల్కాజ్‌గిరి జోనల్ కమిషనరన సంచిత్ గంగువార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఎసిపి, అధికారులు, చైర్మన్ తదితరుల దృశ్యం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

**దుద్యాల్, జనవరి 21, ప్రభాతవార్త:** వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని దుద్యాల్ పోలీసులు పేర్కొన్నారు. జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని హకింపేట్ కూడలిలో పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వ కూడదని సూచించారు. నెంబర్ ప్లేట్, సరైన పత్రాలు లేకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు. భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, కానిస్టేబుళ్లు శంకర్, రాజు, రఫీ యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు అండగా పి ఆర్ టి యు

శాబాద్ విద్యాధికారి లక్ష్మణ్ నాయక్



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**శాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న ఉపాధ్యాయ కుటుంబాలకు పిఆర్టియు అండగా నిలుస్తుందని శాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, యూనియన్ అధ్యక్షుడు దేవిడ్ రెడ్డిలు అన్నారు. శాబాద్ మండలం తాళ్లపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బిక్షపతి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులకు పి ఆర్ టి యు, తాళ్లపల్లి పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సంఘం నాయకులతో కలిసి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలతో పాటు, కష్టంలో ఉన్న వారి కుటుంబాలకు సైతం అండగా నిలిచేందుకు పిఆర్టియు ముందుంటుందన్నారు. పి ఆర్ టి యు తరఫున రూ.75వేలు, తాళ్లపల్లి పాఠశాల ఉపాధ్యాయులు రూ.30వేలు,ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎల్ నరసింహులు, సుశీల, అంజయ్య, కృష్ణ, ఉపాధ్యాయులు నాగిరెడ్డి అంజయ్య సంగమేశ్వర్ రెడ్డి కాజా పాషా, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనతోనే గ్రామాల అభివృద్ధి

అమెజాన్ కంపెనీ జోనల్ మేనేజర్ తాతాజీ, శాబాద్ తహసిల్దార్ అన్వర్

**శాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రజల అనుగుణంగా మౌలిక వసతులు కల్పించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని అమెజాన్ కంపెనీ జోనల్ మేనేజర్ తాతాజీ, శాబాద్ తహసిల్దార్ అన్వర్ లు అన్నారు. శాబాద్ మండల పరిధిలోని పెదవీడు గ్రామంలో అమెజాన్ వెబ్ సర్వీస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ భవనం, ప్రీ-ప్రైమరీ స్కూల్ భవనం, ఓపెన్ జిమ్ ఏర్పాట్లకు బుధవారం గ్రామ సర్పంచ్ చక్కటి రాజ సులోచనతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అమెజాన్ కంపెనీ జోనల్ మేనేజర్ తాతాజీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల కనుగుణంగా మౌలిక వసతులు కల్పించి అభివృద్ధిపరిచేందుకు తమ వంతు సహకారం అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో వీధి దీపాలు, సిసి కెమెరాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. తాహసిల్దార్, గ్రామ సర్పంచ్ లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అమెజాన్ వెబ్ సర్వీస్ కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. వారి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి వైపు నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్కటి దేవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రవి, వార్డు సభ్యులు పవన్ గౌడ్, నాయకులు అశోక్ గౌడ్, కృష్ణారెడ్డి, గ్రామస్తులు, పాల్గొన్నారు.



## బస్సు సౌకర్యం ప్రారంభం

**శాబాద్, జనవరి 21, ప్రభాతవార్త :** మండలంలోని దామర్లపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా దామర్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసిన సమయంలో బస్సు సౌకర్యం కల్పిస్తానని మాట ఇచ్చిన గుడుపల్లి మానస పెంటా రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు నవనీత సురేందర్, బాలకృష్ణ రెడ్డి గ్రామస్థులు నందు చారి, మహేందర్, హరికృష్ణరెడ్డి, జంగయ్య, మల్లేష్, యువకులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టర్ చేసుకోవాలి

**శాబాద్:** భూ యజమాన్య పట్టా పాసుపుస్తకం కలిగిన ప్రతిరైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయ చంద్ర అన్నారు. బుధవారం శాబాద్లో ఈ రైతు రిజిస్ట్రేషన్ నమోదు ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న వ్యవసాయ పథకాల లబ్ది సులభంగా పొందవచ్చునన్నారు. రైతులకు పిఎం కిసాన్ పథకం సహాయానికి రైతు ఐడి తప్పనిసరి అని, పసల్ బీమా, సబ్సిడిలు, రుణాలు, ఇతర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందుతాయన్నారు. రైతులు వీలైనంత త్వరగా మీ సమీప మీసేవ కేంద్రాల్లో లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రైతు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో యూరియా అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, యూరియా కోసం ఆధార్ పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ లు తీసుకురావాలన్నారు.

## ఘనంగా మార్కేండేయ జయంతి

**మేడ్చల్, జనవరి 21, ప్రభాతవార్త:** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని మునీరాబాద్‌లో భక్త మార్కేండేయ జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో మాజీ ఎపిపి విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్ గణేష్, పద్మశాల సంఘం గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.



## కుక్కలను చంపిన ఘటనపై నలుగురిపై కేసు నమోదు

**యాచారం, జనవరి 21,ప్రభాత వార్త:** యాచారం మండలంలో వీధి కుక్కలను మత్తు ఇంజక్షన్లతో చంపిన ఘటనపై పోలీసులు నలుగురిపై కేసులు నమోదు చేశారు. స్ట్రేయాని మల్ ఫౌండేషన్ ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టడంతో గ్రామంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.యాచారం గ్రామ వీధుల్లో సుమారు 70 కుక్కలకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి చంపారని సమాచారం అందడంతో స్ట్రేయాని మల్ ఫౌండేషన్ ప్రతినిధులు గౌతమ్, నుడావత్ ప్రీతి, ఈలప్రోలు అనిత, భాను ప్రకాష్ రావు, మూల రజిని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై ఢిల్లీలోని పీపుల్స్ ఫర్ యానిమల్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మోనిక గాంధీ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వెంటనే స్పందించారు. యాచారం సిఐకి ఫోన్‌చేసి తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దీంతో పోలీసులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తో పాటు మరో ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అయితే రెండేళ్లుగా వీధి కుక్కల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఫౌండేషన్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

**దుద్యాల్, జనవరి 21, ప్రభాతవార్త :** పేదల సొంతింటి కళ కాంగ్రెస్ తోనే సాధ్యం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం దుద్యాల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్‌తో కలిసి ముగ్గువేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు, ఆవాసం లేక ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తున్నమన్నారు. పేదలకు ఇండ్లు ఇవ్వడం అంటే ఒక కాంగ్రెస్తోనే సాధ్యం అవుతుందని అన్నారు. గతంలో పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కూడ మంజూరు చేయలేదన్నారు. లబ్దిదారులకు మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని అందించారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చాలా వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఖాజ, కృష్ణ, సత్యనారాయణ, ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా విక్రమ్ సింహారెడ్డి

**వికారాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** వికారాబాద్ మున్సిపల్ కమీషనర్‌గా విక్రమ్ సింహ రెడ్డి బదిలీ పై వచ్చారు. ఇందులో భాగంగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మున్సిపల్ కమీషనర్‌గా పని చేస్తున్న జాకీర్ అహ్మద్ మొయినాబాద్ మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో విక్రమ్ సింహారెడ్డి బదిలీ పై వచ్చారు.



## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**బంట్వారం, జనవరి 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం తహసిల్దార్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ , సిఎంఆర్ఎఫ్ చెక్కులపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆసరాగా కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ సీఎంఆర్ఎఫ్ డబ్బులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

# ఇబ్రహీంపట్నం అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, జనవరి 21, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రూ. 200 కోట్లతో ఇబ్రహీంపట్నం అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు . బుధవారం ఆయన రూ.15 కోట్ల వ్యాయంతో భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్లు అదేవిధంగా రూ.5 కోట్లతో తట్టిఖానా రోడ్డులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల అదనపు వసతుల భవనం, భోజనశాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు పోషకభోజనం,చదువులో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల ప్రధాన గేటు నుంచి భవన సముదాయం వరకు సిసి రోడ్డు మంజూరు చేయబడిందని తెలిపారు.ఇక ఇబ్రహీంపట్నంలోని సీహెచ్సీ ఆసుపత్రి 100 పడకలతో అప్‌గ్రేడ్ కానుందని దాని నిర్మాణానికిరూ.34 కోట్లతో పనులు ప్రారంభించబడ్డాయన్నారు. అదనపు వసతుల కోసం మరో రూ.30 కోట్లు అవసరమని, నిధుల అనుమతికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింపను కలిశానన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కె. గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు బి. మహిపాల్, ఏదుల్ల పాండురంగారెడ్డి, నాయకులు గౌస్ పాష, ఆకుల ఆనంద్, బర్ల జగదీశ్వర్ యాదవ్, కప్పరి చందు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



## గంజాయి పట్టివేత : 10 మంది అరెస్టు

**మేడ్చల్, జనవరి 21, ప్రభాతవార్త :** గంజాయిని స్వాధీనం చేసుకుని పది మందిని అరెస్టు చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిని వివరాల ప్రకారం మేడ్చల్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి విక్రహిస్తున్న వారితో పాటు గంజాయి సేవిస్తున్న వారిని గుర్తించి పట్టుకున్నారు. అందులో ముగ్గురు గంజాయి విక్రయిస్తున్న వారు ఉండగా, ఏడు మంది గంజాయి సేవిస్తున్న వారు ఉన్నారు. ఈ పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1.12 లీటర్ల ఆషిష్ ఆయిల్, 6 కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్ నుండి గంజాయిని తెచ్చి హైదరాబాద్ అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## అనంతారంకు చెందిన పలువురునాయకులు బిఆర్ఎస్‌లో చేరిక

**శామీర్‌పేట, జనవరి 21, ప్రభాతవార్త:** అనంతారం గ్రామానికి చెందిన పలువురు పలు పార్టీలకు చెందిన నాయకులు మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరినట్లు మూడుచింతలపల్లి మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్‌పాష తెలిపారు. బుధవారం మూడుచింతపల్లి మున్సిపాల్టీలోని అనంతారం గ్రామానికి చెందిన కోల స్వప్న, బుద్ది నరేశ్, ముద్దం శ్రవణ్‌రెడ్డి, మామిడాల వెంకటేశ్‌గౌడ్, స్వామి మరి కొందరు నాయకులు, యువకులు సుమారు 30మంది వరకు ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్, పలువురు గ్రామ నాయకులు రాంరెడ్డి, మరి కొందరు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోసం వచ్చి వెళ్లేటోడ్ని కాదు

మొదటి పేజీ తరువాయి)

వారికి మంచి గుర్తింపు ఉంటుంది. ఐక్యంగా పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దాం. వార్డుల్లో సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి. పరిష్కరిస్తా..ఎన్నికల కోసం వచ్చి వెళ్లేటోడ్ని కాదు.. మాటిస్తే కట్టుబడి ఉంటా..అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే పేదవాళ్లకు మేలు జరుగుతుంది. ఇక్కడి కార్యకర్తలకు ఏమి అవసరం ఉన్నా నన్ను కలవచ్చు.. నాకు నల్లగొండ ప్రజలు ఎలాగో మిమ్మల్ని అలాగే చూసుకుంటా ' అని హామీ ఇచ్చారు. ఈ ఐదేళ్లతోపాటు మరో ఐదేళ్ల కూడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని, ఇక బిఆర్ఎస్ అధికారంలోకి రావటం కల అని కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. ప్రతిపక్ష నాయకులు కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి పాలకపక్షాన్ని ప్రశ్నిస్తారని అనుకున్నామని, మూడు నిమిషాలు ఉండి వెళ్లిపోయారని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే మెజార్టీగా గెలిచారని, కనీసం మున్సిపల్ ఎన్నికల్లో 10శాతం అయినా బిఆర్ఎస్ గెలవాలని కెటిఆర్‌కు ఆయన సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఒక్కసీటు రాలేదని, మళ్లీ అధికారంలోకి వస్తామని కెటిఆర్ చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు దశలవారీగ తీరుస్తున్నామన్నారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వటం తమ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. ప్రజల్లో ఉండి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని మంత్రి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మూడు మున్సిపాల్టీల్లో 68 వార్డుల వారీగ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలను వేస్తుందని పేర్కొన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమాను వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలని, సర్వే ఆధారంగ గుర్తించి పార్టీ టికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ ఎల్లంపేట్‌కు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ అధ్యక్షులు మహేశ్‌గౌడ్‌లు ఇన్‌చార్జిగ వ్యవరిస్తారని, అలియాబాద్ మున్సిపాల్టీకి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డిలు ఇన్‌చార్జిగ ఉంటారని, మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్‌కుమార్‌యాదవ్, ఫీర్జాధిగూడ కాంగ్రెస్ నాయకులు అమర్‌సింగ్‌లు ఇన్‌చార్జిలుగా ఉంటారని, ప్రతి వార్డులకు కూడ పార్టీ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేస్తుందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దోచుకున్న వారికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, జడ్పీమాజీ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్‌కుమార్‌యాదవ్, మేడ్చల్ ఎబ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు మహేశ్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, ఎల్లంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు విఘ్నేశ్వర్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మునిపై మతోన్మాదమా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం మహాత్మునిపై విద్వేషాన్ని ప్రదర్శిస్తోందన్నారు. మతోన్మాదాన్ని ప్రతిబింబించేలా చట్టాలకు పేర్లు పెట్టడం భారతదేశ లౌకిక రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య పాలనకు పరాకాష్టగా అభివర్ణించారు. వర్షాభావ పరిస్థితుల్లో కరువుతో కుదేలైన రైతు కూలీలకు ఉపాధి కల్పించేందుకు రూపొందించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఆరోపించారు. నూతన చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై సుమారు రూ.3000 కోట్ల అదనపు భారం పడనుందని, 60 రోజుల పాటు ఉపాధి పనులపై నిషేధం విధించడం వల్ల పని దినాలు తగ్గి వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రమవుతుందని అన్నారు. దీని ఫలితంగా రైతు ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి కీలక అంశంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ స్పందించకపోవడం కేంద్రం ముందు చేతకాని వైఖరిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. ఉపాధి కూలీల ఆగ్రహానికి గురికాకముందే కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, యాట నరసింహ, సర్పంచ్ మహేందర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బిచ్య నాయక్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,రాములు, చాప బీమ్, వెంకటేష్, రామకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేవల్‌బాలాజీ భూములను పీఓబీ నుంచి తొలగించాలి

-ఇళ్లను క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ చేయండి

**ఘట్‌కేసర్, జనవరి 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ బాలాజీనగర్, ద్వారకానగర్, గాంధీనగర్ కాలనీల్లోని ఇళ్లను క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ఏసీని కలిసి సమస్యను తెలియజేశారు. సర్వేనంబర్లు 1, 2, 6, 7, 9, 10, 11, 12, 18, 45, 411, 465, 466, 602, 603 లలోని భూములలో వెంచర్ చేయగా ప్రజలు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. 2008 సంవత్సరంలో ఈభూములు దేవల్‌బాలాజీ భూములు అని పేర్కొంటూ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ రిజిస్ట్రేషన్లు జరుగకుండా నిలిపివేశారని తెలిపారు. మొదటి నుంచి పట్టాభూములుగా ఉన్న భూములను మధ్యంతరంగా దేవాదాయ భూములుగా మార్చి సర్వేనంబర్లను నిషేధిత జాబితా (పీఓబీ)లో చేర్చడంతో ఇండ్లు, స్థలాలు రిజిస్ట్రేషన్లు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం చేసుకున్న పేదలకు కరెంట్ మీటర్ కనెక్షన్, మున్సిపల్ నుంచి ఇంటినెంబర్ కేటాయించడం లేదని, గతంలో అధికారులు ఈభూములు దేవాదాయ భూములుగా నిర్ధారిస్తే ఇళ్లను క్రమబద్ధీకరణ చేయాలని పలుసార్లు విజ్ఞప్తి చేసిన ఏలాంటి ఫలితం లేదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఘట్‌కేసర్ ప్రజలు ఎదుర్కొంటున్న దేవల్‌బాలాజీ ఇళ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి క్రమబద్ధీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏసీని కలిసిన వారిలో మాజీ కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావు, మాజీ వార్డుసభ్యులు కొత్తకొండ వెంకటేశ్, బర్ల దేవేందర్, కాలనీ నాయకులు శశిధరణ్, బర్ల రాధాకృష్ణలు ఉన్నారు.



## భూనిర్వాసితులకు నష్టపరిహారం పంపిణీ షురూ..

..మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 21, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నందున భూము లు కోల్పోతున్న కొందరు భూనిర్వాసితులకు నష్టపరిహారంను మేడ్చల్‌జిల్లా కలెక్టర్ మనుచౌదరి అందజేశారు. మేడ్చల్ జిల్లాకలెక్టరేట్‌లో కలెక్టర్ తనఛాంబర్‌లో ఎలివేటెడ్ కారిడార్ రోడ్డుకు సంబంధించి కొందరు భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని అందజేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అల్వాల్ మండలంలో 1.5కిలో మీటర్లు, శామీర్‌పేట మండలంలో 5కిలోమీటర్ల పొడవునా ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నందున భూసేకరణ పూర్తి అయిన భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వటం ఆరంభమైంది. గత ఏడాదిలో ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియను అధికారులు చేపట్టారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో 18.5కిలోమీటర్ల పాటు సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పరిహారాన్ని చదరపు గజానికి 90వేల రూపాయలు వేలుగా ఖరారు చేసినట్లు, ఇందులో భాగంగ సర్వేనెంబరు 96కు సంబంధించిన 784చదరపు గజాల విస్తీర్ణంకు సంబంధించిన భూముల యజమానులకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి నష్టపరిహారంను భూనిర్వాసితులకు అందజేశారు. దీంతో 784చదరపు గజాల స్థలాన్ని ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిమిత్తం హెచ్ఎండిఏ ప్రతినిధులకు అప్పగించటం జరిగింది. ఈ ఎలివేటెడ్ కారిడార్ రోడ్డును 2,232కోట్ల రూపాయలతో నిర్మించటానికి అంచనా వ్యయాన్ని నిర్ణయించారు. దీనిలో 11.65కి.మీ. వంతెన రూపంలో, 6.52కి.మీ.ఇదే రోడ్డు స్థాయి రూపంలో, హాకీంపేట్ ఎయిర్‌పోర్టు వద్ద 450మీటర్ల మేరకు అండర్ టన్నెల్ రోడ్డును నిర్మించనున్నారు.



## మిత్రుల కోసం మూడు వార్డులు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా అనుకూల ఓటు సాధిస్తామా లేదా అనే మీమాంసలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. దానివల్ల మూడింటిలో కాంగ్రెస్ గుర్తుతోనే పోటీ చేయాలని టిజెఎస్ నేత సోమశేఖర్‌కు సూచించినట్లు తెలిసింది. కాంగ్రెస్ సూచన పట్ల విముఖత వ్యక్తం చేసిన ఆయన సొంత పార్టీ గుర్తుతోనే పోటీ చేస్తానని స్పష్టం చేసినట్లు పార్టీవర్గాల సమాచారం. త్రిముఖ, చతుర్ముఖ పోటీలో టిజెఎస్ కూడా బరిలో ఉంటే అధికార పార్టీకి నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. టిజెఎస్‌కు ఆర్థిక పరమైన ఇబ్బందులు కూడా ఉంటాయంటూ బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది.

# సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రతిభా పరీక్ష..

**దుద్యాల్, జనవరి 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రతిభ పరీక్ష ను నిర్వహించారు. ఎంఈవో విజయరామారావు, సోషల్ ఫోరం కన్వీనర్ రాములు మాట్లాడుతూ ప్రతిభా పరీక్షలు విద్యార్థినీ, విద్యార్థులకు చాలా ఉపయుక్తమని వారిలో ఉన్న ప్రతిభ ను, నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగపడతాయని భవిష్యత్తులో పోటీ పరీక్షలలో పాల్గొనడానికి దోహదపడతాయని అన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఫిబ్రవరి 2న జిల్లాస్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టులో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిభ పరీక్షకు మండలంలోని దుద్యాల్, కుదురుమళ్ళ, హకీంపేట్, ఉన్నత పాఠశాలలతో పాటు చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మండలం నుండి తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో నలుగురు చొప్పున జిల్లా స్థాయికి అర్హత సాధించారని అన్నారు.



ప్రతిభా పరీక్ష ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఇ

కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, వెంకటేశం, మంజుల, మల్లప్ప, ముకుంద రెడ్డి, సాలిబాయి, మాధవి, అభయ్ కుమార్, శ్రీనివాస్, సుధాకర్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుశీలమ్మకు శ్రద్ధాంజలి ఘటించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ

**నందిగామ, జనవరి 21, ప్రభాతవార్త):** నందిగామ మండల కేంద్రానికి చెందిన రాయప్పగారి సుశీలమ్మ దశ దినకర్మలో సర్పంచ్ కొమ్ము కృష్ణ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు మెంబర్లు అగ్గిప్రసాద్ గౌడ్, అగ్గి మమత సురేష్, చించేటి లత శివ గౌడ్, శివగళ్ళ ప్రవీణ్, శివగళ్ళ సురేష్, బొమ్మగల నర్సింలు, సీనియర్ నాయకులు శివగళ్ళ సుమన్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ నరేందర్ రెడ్డి, తడకల జంగయ్య, కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, మైపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

BEFORE HON'BLE Hon'ble
Prl.Junior Civil Judge CUM VII ADDL. Judicial Magistrate of First Class, AT MEDCHAL
OS.No. 954 OF 2025
BETWEEN
1. Smt.Thokala Aruna, W/o. Late Thokala Ranga Reddy, Aged about: 56yrs, Occ: Housewife, R/o. 5-62, Dabilpur, Medchal(M), Medchal-Malkajgiri District, Telangana State-501401, Aadhar No 3259 0867 8044
2. Thokala Sushma Reddy, D/o Late Thokala Ranga Reddy, Aged about yrs, Occ: R/o: 5-62, Dabilpur, Medchal(M), Medchal-Malkajgiri District,Telangana State-501401. Aadhar No.4097 9472 8182
3. Thokala Sukumar Reddy, S/o Late Thokala Ranga Reddy, Aged about: Yrs, Occ: R/o:13-248, Venkat Ramaiah Colony, Medchal (M), Medchal-Malkajgiri District, Telangana State- Aadhar No.
...Plaintiffs
AND
1. The Tahsildar Medchal Mandal, having Office at MRO Office, Beside Police Station, Medchal
2. To All Concerned
...Defendants
TO,
2.All Concerned (Defendant NO.2)
Please take notice that the above named plaintiffs have filed the above suit for declaration of legal heirs that the plaintiffs are the Owners of Suit Schedule property& for other relief etc. The same is coming for your appearance on 09-02-2026. You are hereby directed to appear before the Hon'ble Prl.Junior Civil Judge CUM VII ADDL.JudicialMagistrate of First Class, At Medchal, in the above suit either in person or through your Advocate on 09-02-2026 at 10.30 AM., failing which the matter will be decided in your absence. SCHEDULE PROPERTY: All that the residential open plot bearing no. 215, admeasuring 266.0 Sq.yds or 222.37 sq.mts,ide survey No.1091(part) and 1092(full) under Block No.4,situated at Sathyanagar Colony, medchal (V), Medchal (M), Medchal-Malkajgiri District, Telangana State within the limits of medchal Village, Medchal-Malkajgiri District, Telangana State. NORTH : 30' Wife Road. SOUTH : Plot No.214. EAST : 20' Wife Road. WEST : Plot No.235
("BY ORDER OF THE HON'BLE COURT")
PANUGANTI RAJESHWAR
ADVOCATES
Office at 9-82/D/104, Udayanagar Colony, Boduppal Uppal, Hyderabad-92.
Mobile:9849865082


వైద్యం అందిస్తున్న పశువైద్యాధికారి

## పాడిరంగాన్ని అభివృద్ధి చేసుకోండి

**కందుకూరు,జనవరి21, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉండే పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి పశువుల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ మేలైన దిగుబడులను సాధించాలని పాడిరంగాన్ని అభివృద్ధి చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా అధికారి డాక్టర్ శ్రీకర్ రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని చిప్పలపల్లి గ్రామంలో జరిగిన పశు వైద్య శిబిరాన్ని సందర్శించి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పాడి పరిశ్రమ ద్వారా వ్యవసాయ రంగానికి ఆర్థిక తోడ్పాటు అందుతుందన్నారు .పాడి పశువుల పట్ల జాగ్రత్తలు పాటించి మంచి ఫలితాలు పొందాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ సురముని లలిత కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు .గ్రామీణ ప్రాంతాలలో రైతులకు పాడి పరిశ్రమ పట్ల పూర్తిస్థాయి అవగాహన లేకపోవడం వల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ విషయంలో పశు వైద్యశాఖ గాని పశుగణాభివృద్ధి సంస్థ గాని తోడ్పాటును అందించాలని కోరారు .పశు వైద్య సేవలు మారుమూల గ్రామాలకు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని కోరారు. పశువులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే చాలా దూరం ప్రయాణించవలసి వస్తుందని అలా కాకుండా గ్రామాలలోని పశువులకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎదకు వచ్చిన పశువులకు డిజిటల్ విజ్ఞానాన్ని ఉపయోగించి ఎఐ దాని ద్వారా కృత్రిమ గర్భధారణ చేయడం జరిగింది, ఎదకురాని 28 పశువులకు చికిత్సలు చేయడం 12 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు అందించడం 65 వేలకు నట్టల నివారణ మందులను తాగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్ర లావణ్య వార్డు మెంబర్లతో పాటు రాచలూరు పశు వైద్యాధికారి డాక్టర్ షేన్,లేమూరు పశువైద్యాధికారిని డాక్టర్ సంధ్యారాణి కందుకూరు పశువైద్యాధికారిని డాక్టర్ దీప్తి గోపాలమిత్రలు లక్ష్మయ్య,ఖరీఫ్ పశు వైద్య సిబ్బంది వసంత అప్సర్ తో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.


రాయితీపై రైతులకు వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**కందుకూరు, జనవరి 21, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని మహేశ్వరం నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్ పేర్కొన్నారు బుధవారం కందుకూరు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ప్రభుత్వంద్వారా లబ్ధిదారులకు రాయితీపై అందిన వ్యవసాయ యాంత్రీకరణ పని ముట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు వ్యవసాయరంగాన్ని నిర్వీర్యంచేశారని రాయితీపై వ్యవసాయ పనిముట్లను ఇవ్వలేదని దాని ద్వారా రైతులకు ఆర్థిక భారం పెరిగిపోయిందన్నారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు రైతులను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తున్నారు అన్నారు. ప్రభుత్వమ్ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దశలవారీగా రైతులకు అవసరమైన పనిముట్లను రాయితీపై సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతుల పక్షాన నిలబడుతుందని గ్రామాలలో ఉన్న కమిటీ డైరెక్టర్లు రైతులకు కావాల్సిన పనిముట్లను గుర్తించి సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో యూరియా కొరత లేకుండా వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులో సూచనలు సలహాలు అందించా లని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ సహాయ సంచాలకులు సుధారాణితో పాటుమండల వ్యవసాయ అధికారి లావణ్య మండల అభివృద్ధి అధికారి బి సరిత రాజు జగదీశ్వరి చారి రాఘవేంద్ర చారి మార్కెట్ కమిటీ యాదయ్య డైరెక్టర్లుతోపాటు లబ్ధిదారులు మల్లేష్ జంగయ్య నగేష్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి


బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న నాయకులు

**చౌడపూర్, జనవరి 21, ప్రభాతవార్త :** బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులను అందించి, లబ్దిదారులకు ఆర్థికభరోసాను అందించటం ప్రశంసనీయమని చౌడపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు.. బుధవారం చౌడాపూర్ గ్రామానికి చెందిన లబ్ది దారులకి ,పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో రూ. 1,79,000 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసారు. గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ,. కిసాన్ సెల్ అధ్యక్షులు మాసయ్య, గోపాల్,హనుమంత్, యాదయ్య. శ్రీను, నరేష్,ప్రభాకర్, యాదయ్య, మణికంఠ, బాలరాజ్ పాల్గొన్నారు.


డైరి ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

## టిజివొ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

**రంగారెడ్డి అర్బన్,జనవరి21,ప్రభాతవార్త:** టిజివొ అసోసియేషన్ జిల్లా డైరీని అధ్యక్షులు డాక్టర్ రామారావు,కార్యదర్శి శ్రీనేష్‌కుమార్ నోరి ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్,జిల్లారెవెన్యూ అధికారి సంగీత,టిజివొ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలూరి శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్ హాజరై డైరీని విడుదల చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ,టిజివొ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ నిరంతర సేవా కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తోందని ప్రశంసించారు.జిల్లాలో గెజిటెడ్ అధికారులందరినీ సమన్వయంతో కలుపుకొని అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.టిజివొ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ,రంగారెడ్డి జిల్లా టిజివొ అసోసియేషన్ రాష్ట్రంలోనే ముందున్న సంఘటనా శక్తిగా నిలుస్తోందని,అసోసియేషన్ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ఆదర్శంగా మారిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ అసోసియేషన్ సభ్యులు శ్రీరామ్‌రెడ్డి,యాదగిరి,ఫోరం ప్రెసిడెంట్ షౌకత్ అలీ,నర్సి రెడ్డి,శ్రీనివాస్,టీజీవో రంగారెడ్డి జిల్లా సభ్యులు నూతనికంటి వెంకట్,నామాల శ్రీనివాస్,రేవతి,శాంతిశ్రీ,అలివేలు, సైదమ్మ, బాలరాజ్ గౌడ్,రాకేష్,వెంకటనారాయణ,నాగేశ్వరరావు, అనిత,మహేశ్వరి ,జ్యోత్స్న,మహేష్,మాసూద్ అలీ,నరేందర్,ఫోరం నాయకులు,ఇతర జిల్లాల ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

## జెఇఇ ఎగ్జామ్ కేంద్రాలను సందర్శించిన జాయింట్ కలెక్టర్


నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జెఇఇ ఎగ్జామ్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా జాయింట్ కలెక్టర్

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 21, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విజేందర్ రెడ్డి సందర్శించి జెఇఇ ఎగ్జామ్ కేంద్రాలను పరిశీలించారు. పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు కాచవాని సింగారం పరిధిలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ సందర్శించి జెఇఇ పరీక్షా కేంద్రాలపై ఆరా తీశారు. జాయింట్ కలెక్టర్ వెంబడి ఘట్‌కేసర్ మండల తహసీల్దర్ చంద్రశేఖర్ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## పేదల పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

### ...ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, జనవరి 21, ప్రభాతవార్త:** బిజెపి ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా యంజిఎన్ఆర్‌జిఎస్ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశ్యంతో మహాత్మాగాంధి పేరుతో ఉన్న చట్టాన్ని మార్చి విబిజిరామ్ జి చట్టాన్ని తీసుకువచ్చిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పెద్దేముల్ మండలం కందనెల్లిలో యంజిఎన్ఆర్ఈజిఎస్ పథకానికి మద్దతుగా విబిజిరామ్ జి పథకానికి వ్యతిరేకంగా నిర్వహించే ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2005లో యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధి, అప్పటి ప్రధాని మన్‌మోహన్‌సింగ్ పేదరికాన్ని తగ్గించడానికి, పేదల సంక్షేమం కోసంపేదలు రెండు పూటలు అన్నం తినాలనే ఉద్దేశ్యంతో బొంబాయి వలసలు తగ్గించడానికి 100 శాతము కేంద్ర నిధులతో యంజిఎన్ఆర్ఈజిఎస్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. బిజెపి ప్రభుత్వం 100 శాతము కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న 100 శాతము పథకాన్ని, 40 శాతము రాష్ట్రప్రభుత్వం ఇవ్వాలని నిబంధన పెట్టి పథకాన్ని తూట్లు పొడుస్తుందని విమర్శించారు. పేదోడి కోసం కాంగ్రెస్ పనిచేస్తే, పెద్దోడి కోసం బిజెపి కష్టపడుతుందని విమర్శించారు. రైతుకు వ్యతిరేకంగా తెచ్చిన రైతు నల్లచట్టాలు ఏ విధంగా అయితే రద్దు చేశారో అదేవిధంగా గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా ఉన్న జీరామ్ జి చట్టాన్ని కూడా తొలగించాలని


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

డిమాండ్ చేశారు. చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గ్రామసభల్లో ఈ పథకాన్ని రద్దు చేసేందుకుతీర్మానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, సర్పంచ్ యాదమ్మ, టిపిసిసి మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్, డిఎల్‌డిఎ మాజీ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, శోభారాణి, నాయకులు ఉప్పరి మల్లేశం, మధుసుధన్‌రెడ్డి, శ్రీనివాస్ చారీ, కిరన్, జన్నె నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ధారూర్‌లో కల్యాణలక్ష్మి, సిఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

**ధారూరు, జనవరి 21, ప్రభాతవార్త :** ధారూర్ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ సాజిదా బేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మాన్సింగ్ హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల ు పంపిణీ చేశారు. అనంతరం, వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న బాధితులకు 21 లక్షల 27 వేల రూపాయల(36 చెక్కులు) విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల ు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆడబిడ్డల వివాహాలకు 'కళ్యాణ లక్ష్మి' కొండంత అండగా నిలుస్తోందని, అలాగే ఆపద కాలంలో వైద్య ఖర్చుల


కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోసం సిఎం ఆర్ ఎఫ్ నిధులు ఎంతో ఆసరాగా మారుతున్నాయని వారు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రాములు, సర్పంచ్ లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల సీజ్


ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు

**ధారూరు, జనవరి 21, ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక ు తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల ు జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం,స్థానిక ధారూర్ పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం శివారు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అ నుమతులు లేకుండా ఇసుక ు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వెంటనే ఆ వాహనాల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్ యజమా నులపై కేసులు నమోదు చేశారు. అ నుమతి లేకుండా వాగుల నుంచి ఇసుక ు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ ఐ సున్నం రాఘవేందర్ హెచ్చరించారు.

## గీతా వాహిని ఆధ్వర్యంలో ద్వారకలో భగవద్గీత పారాయణం

**వికారాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** భగవద్గీత ప్రచారంలో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గీతా వాహిని సంస్థ ఆధ్వర్యంలో ద్వారక లో సంపూర్ణ భగవద్గీత గీతా పారాయణం నిర్వహించారు. గతంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం కురుక్షేత్రం, అయోధ్య, యాదగిరిగుట్ట, ముచ్చింతలో కూడా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భగవద్గీత ప్రపంచలోనే జీవిత సత్యాన్ని బోధించే గ్రంథం, భగవంతుడు స్వయంగా చెప్పినటువంటి ఈ ఉపదేశం వల్ల అందరి ప్రజల యొక్క సంక్షేమం, వ్యక్తిత్వ నిర్మాణం ఆధారపడి ఉందని గీతా వాహిని అధ్యక్షురాలు టి.శ్రీదేవి తెలిపారు. మన జీవితంలో వచ్చే అనేక సమస్యలకు పరిష్కారం చూపించే గ్రంథమని, ఈ గ్రంథాన్ని ఇటీవల మన దేశంలో పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలలో భగవద్గీత ను వారి భాషలలోకి అ నువదించి చదువుతున్నటువంటి విషయం మనందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు. భగవద్గీత రాబోయే రోజులలో భావి తరాలకు అందించే విధంగా అనేక కార్యక్రమాల ు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఇందులో భాగంగానే శ్రీకృష్ణునికి సంబంధించిన స్థలాలలో ఈ సంపూర్ణ భగవద్గీత పారాయణం


గీతా పారాయణం చేస్తున్న గీతా వాహిని సభ్యులు

నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజులలో శ్రీకృష్ణ జన్మస్థానమైన మధుర, పూరి జగన్నాథ్ ఆలయాలలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గీతా వాహిని కమిటీ సభ్యులైనా ఉపాధ్యక్షురాలు ఎం.లావణ్య, కోశాధికారి వి.వరలక్ష్మి, విజయ, మాధురి, సునీత, స్వరూప,ఝాన్సీ రాణి, నీరజ, కరుణ, స్వాతి, లక్ష్మి, సంజీవరాణి, సరిత, సరళ, జాగృతి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సదానంద రెడ్డి,సిద్ధార్థ కాలేజ్ డైరెక్టర్ జయదేవ్, అమరేందర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో పార్టీ పటిష్టంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న విక్రంరెడ్డి

**మేడ్చల్, జనవరి 21, ప్రభాతవార్త :** బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంగా ఉంటేనే దేశంలో పటిష్టంగా ఉంటుందని బిజెపి రాష్ట్ర నాయకుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో బిజెపి బూత్ నిర్మాణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ పటిష్టంగా మారాలంటే బూత్ స్థాయిలో పార్టీబలం గట్టిగా ఉండాలని తెలిపారు. ప్రతికార్యకర్త పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలని తెలిపారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఏకతాటిపై ఉండి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్‌ప్రధాన కార్యదర్శులు ప్రేందాస్, వంశీ విజయ్, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్త, నాయకులు రాగం అర్జున్ రాఘవరెడ్డి, రాజు, సర్వేశ్వర్‌రెడ్డి, హరిబాబురెడ్డి, రాంచంద్రారెడ్డి, నర్సింగ్ రావు, బాబు రాజు, భరత్, మహేష్, అవినాష్ చారి, రాజేష్, ఈశ్వర్, లక్ష్మణ్, అనిత పాల్గొన్నారు.

## దర్గాను యధాస్థానంలో ఏర్పాటు చేయాలి

**కొడంగల్,జనవరి 21,ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించిన మహబూబ్ సుభాని దర్గా,పీర్ల మసీదును యధాస్థానంలో ఏర్పాటుతో పాటు స్మశాన వాటికలకు ప్రహరీని నిర్మించాలని ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్కే.గుల్షన్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముస్లీం,మైనార్టీలతో కలిసిన సందర్భంలో యధా స్థానంలో మతస్థలాల ఏర్పాటుతో పాటు స్మశాన వాటికలకు ప్రహరీనిర్మాణానికి అధికారులను ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.ఈ విషయంపై కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా తనకు సంబంధం లేదని చెప్పడం జరిగిందన్నారు.ఐదు నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా దర్గా,పీర్ల మసీదును యధా స్థానంలో ఏర్పాటు చేయడంతో పాటు స్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని లేని పక్షంలో


విలేకరులతో మాట్లాడుతున్న ఎంఐఎం పార్టీ నాయకులు

ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.ఈ సమావేశంలో నాయకులు సర్తాజ్ హుస్సేన్,షే రోమాన్,ఎండీ. ముర్తుజా,అజార్, శంషీర్,అమీర్,ముస్తఫా,రెహన్,రమేష్‌నాయక్,అర్షద్ అలీ పాల్గొన్నారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

### ఎస్ఐ రమేష్ కుమార్

**కుల్కచర్ల,జనవరి 21, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు.జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రధానచౌరస్తాలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోడ్డు భద్రతనియమాలపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.రహదారి భద్రత అనేది ఒకరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.వేగ పరిమితులకు లోబడి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపరాదని అన్నారు.డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు.వాహనాలను అజాగ్రత్తగా నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సిబ్బంది శేఖర్, భుపాల్‌రెడ్డి,శివకుమార్ సత్యయ్య,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

### ....పెద్దేముల్ ఎస్ఐ శంకర్

**పెద్దేముల్, జనవరి 21, ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పెద్దేముల్ ఎస్ఐ శంకర్ హెచ్చరించారు. బుధవారం పెద్దేముల్ ఎస్ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుల్లు రవిందర్‌రెడ్డి, జగన్నాథ్‌లు విధులలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు ట్రాక్టర్ల ఇసుక డంపును స్వా ధీనం చేసుకొని మండల తహసిల్దార్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐశంకర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగకరం

### ..పెద్దేముల్ ఎస్ఐ శంకర్

**పెద్దేముల్, జనవరి 21, ప్రభాతవార్త:** నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగకరమని పెద్దేముల్ ఎస్ఐ శంకర్ అన్నారు. బుధవారం పెద్దేముల్‌మండలం ఓంలానాయక్‌తాండాలో సర్పంచ్ సుమిత్రబాయి, గ్రామ పెద్దల సహకారంతో 9 సిసి కెమేరాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే గొడవలు, దోపిడిలు, దొంగతనాలు జరిగేందుకు ఆస్కారం ఉండదని అన్నారు. ఒకవేళ జరిగినా సిసి కెమెరాల సహాయంతో సులువుగా గుర్తించేందుకు వీలుంటుం దని అన్నారు. అందుకు ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..ప్రాణాలను కాపాడుకోండి

### పరిగి ఎస్ఐ మోహనకృష్ణ

**పరిగి, జనవరి21, ప్రభాతవార్త:** వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని పరిగి ఎస్ఐ మోహనకృష్ణ తెలిపారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బుధవారం వికారాబాద్ జిల్లా, పరిగి పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన సదస్సుని నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు సంభవించి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని,ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రానం ధరించాలని అన్నారు.. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణించకూడదని , సీట్ బెల్టులను తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఈ మధ్య కాలంలోనే మద్య పానం సేవించి లారీ నడిపిన వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష విధించారని, అజాగ్రత్తతో రోడ్డుదాటే క్రమంలో ఓ ఆటో డ్రైవర్ కూడా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు . ఇక నుండి ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు, జైలు శిక్ష తప్పవని పరిగి ఎస్సై మోహన కృష్ణ పేర్కొన్నారు

## ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి


మేడ్చల్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**మేడ్చల్, జనవరి 21, ప్రభాతవార్త :** ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవించి చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

**వికారాబాద్, జనవరి 21, ప్రభాతవార్త :** వాహనదారులు నిబంధనలు తప్పకుండా పాటించాలని వికారాబాద్ సిఐ భీమ్‌కుమార్ అన్నారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ భీమ్‌కుమార్

వాహనదారులకు పలు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని సూచించారు. ఆటో వాలాలు పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోరాదరని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, ఏవైన ప్రమాదాలు జరిగితే వారిపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారనే విషయం గమనించాలని అన్నారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించి సుఖమైన ప్రయాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

